## క్లుప్తంగా

### రుణ అర్హత పత్రాల పంపిణీ


రైతులకు కార్డులు అందిస్తున్న ఏడీఓ శైలజ

**ఏలూరు రూరల్** : ఖరీఫ్‌లో సాగుదారులకు బ్యాంకుల నుంచి పెట్టుబడి రుణాలు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీఓ శైలజ అన్నారు. బుధవారం పోణంగి రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. శైలజ మాట్లాడుతూ అర్హతగల సాగుదారులు అందరికీ కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వ బ్యాంకుల నుంచి పంట రుణాలు అందుకోవచ్చన్నారు. రైతులు పొందే రుణాలకు ప్రభుత్వం హామీ దారుగా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం బ్యాంకులను సన్నద్ధం చేసిందన్నారు. అనంతరం రైతులకు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారిణి జీవనసంధ్య, పెద్దలు గొంగాడి సాంబశివరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### దళిత యువకులపై దాడికి ఖండన


గాయపడిన యువకుడు

**ఏలూరు (టూటౌన్):** ఎస్సీ వర్గీకరణకు నిరసనగా బుధవారం నిర్వహించిన బంద్‌లో భాగంగా టి.నర్సాపురం మండలం బందం చర్ల గ్రామంలో ఒక హోటల్‌ను మూసివేసి బంద్‌కు సహకరించాలని కోరిన దళిత యువకులపై హోటల్ యజమాని కత్తితో దాడి చేసి గాయపర్చడాన్ని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ ఖండించింది. హోటల్ మూసి బంద్‌కు సహకరించాలని కోరిన వారిపై కత్తితో దాడి చేసిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు.

### రేపు గ్రామ సభలు

**ఏలూరు రూరల్** : ఈ నెల 23వ తేదీ ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ బి ప్రణవి అన్నారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, ఎంఎన్‌ఆర్ ఈజీఎస్ ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2024లో చేపట్టాల్సిన అభివృద్ధిపై చర్చించాలని అన్నారు. పెద్దలు, ప్రజలు సూచనలు, సలహాలు తీసుకుని గ్రామాభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనులను ముందుగా గుర్తించాలని సూచించారు. ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి, కార్యదర్శులు ప్రసాద్, సుమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# భారత్ బంద్ ప్రశాంతం

**ఏలూరు (టూటౌన్):** ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ దళిత సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఏలూరు నగరంలో భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. తెల్లవారు ఝాము 4 గంటల నుంచి వివిధ సంఘాల నాయకులు కొత్తబస్టాండ్ వద్దకు చేరుకున్నారు. డిపోలోని బస్సులు బయటకు రాకుండా గేటు ఎదుట బైఠాయించారు. ముందస్తు సమాచారంతో వ్యాపార సంస్థలు, హోటల్స్ యజమానులు, విద్యాసంస్థలు బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాయి. తెరిచి ఉంచిన దుకాణాలను, చిరు వ్యాపారులను బంద్ నిర్వాహకులు బైక్‌లపై తిరుగుతూ మూయించారు. రామచంద్రరావుపేట, పవరుపేట, వన్‌టౌన్, ఫైర్ స్టేషన్ సెంటర్ తదితర ప్రాంతాలు బంద్ కారణంగా వెలవెలబోయాయి.

**కొత్త బస్టాండ్ వద్ద బైఠాయింపు**

కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ గ్యారేజ్ నుంచి బస్సులు రానీయకుండా తెల్లవారు ఝాము నుంచి దళిత ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. స్థానిక సీఎంఆర్ కాంప్లెక్స్ ఎదురుగా రోడ్డుపై కొద్ది సేపు ఆందోళన చేశారు. వర్గీకరణతో అధిక సంఖ్యలో ఉన్న మాలలు తీవ్రంగా నష్టపోతారని దీనిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమంటూ పెద్ద పెట్టున నినదించారు. బంద్ నిర్వాహకులను తొలగించేందుకు పోలీసు యంత్రాంగం ప్రయత్నించిడంతో కొద్దిసేపు వాతావరణం వేడెక్కింది. పోలీసుల విజ్ఞప్తి మేరకు బంద్ నిర్వాహకులు ఉదయం 11 గంటలకు అత్యవసరంగా ఆర్టీసీ డిపో నుంచి ఒక బస్‌ను బయటకు వదిలారు. ఈ కార్యక్రమాల్లో దళిత ప్రజా సంఘాల నాయకులు నూకపెయ్యి కార్తీక్, కొరబండి బాబూరావు, మెరుగు సత్యనారాయణ, ఎరికిపాటి విజయ్, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పెద్ద రైల్వే స్టేషన్‌లో పహారా కాస్తున్న పోలీసులు


ఆర్ఆర్‌పేటలో దుకాణాన్ని మూయిస్తున్న దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు

### వన్‌టౌన్ సీఐగా సత్యనారాయణ


సీఐ సత్యనారాయణ

**ఏలూరు టౌన్:** ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమని, ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో సేవలు అందించేందుకు చర్యలు చేపడతామని వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ అన్నారు. వన్‌టౌన్ సీఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ ఇక్కడ పనిచేసిన అనుభవంతో నేరాలను నియంత్రించేందుకు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఆయన డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను కలిశారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** నగరంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమడవోలు, ఆటోనగర్ ఫీడర్ పరిధిలో ఆటోనగర్, కొమడవోలు, తూర్పు లాకులు, సాయినగర్ లైన్‌ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, శనివారపు పేట సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ల పరిధిలో శనివారపు పేట, శ్రీరామ్ నగర్, విద్యా నగర్, శాతవాహన నగర్, దొండపాడు, న్యూ అశోక్ నగర్, దుగ్గిరాల ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

- ఏలురు రూరల్, వట్లూరు, శాంతి నగర్, శనివారపు పేట, పూలపర్రు, కలెక్టర్ బంగ్లా, కలెక్టర్ కార్యాలయం, అశోక్ నగర్, రామచంద్రరావు పేట, సంతోష నగర్, కోటదిబ్బ, ఏలూరు ఒన్‌టౌన్, ఏలూరు టూ టౌన్, ఏలూరు త్రీ టౌన్, వెంకన్న ట్యాంక్, కలపర్రు, పెదపాడు మండలం, కొత్తూరు జ్యూట్ మిల్, తంగెళ్లమూడి, జానంపేట ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ జేపీబీ నటరాజన్ పేర్కొన్నారు.

### చిల్డ్రన్ హోమ్‌ను సందర్శించిన ఎస్పీ


చిల్డ్రన్ హోమ్‌లో చిన్నారులతో ఎస్పీ, జేసీ

**ఏలూరు టౌన్:** స్థానిక రవితేజ చిల్డ్రన్ హోమ్‌ను ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి బుధవారం సందర్శించారు. చిన్నారులతో కొద్దిసేపు గడిపి, మిఠాయిలు పంచారు. వారి ఆరోగ్య పరిస్థితులు, చదువు, నిర్వహణ అంశాలపై హోమ్ నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి నుంచే వారి భవిష్యత్తుపై నిర్దిష్టమైన ఆకాంక్షను పెంపొందించేలా వారికి అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. విద్య ద్వారా భవిష్యత్తులో కలిగే ఉపయోగాలను తెలియజేయాలన్నారు.

# వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

**ఏలూరు (టూటౌన్):** కలకత్తా ఆసుపత్రిలో అత్యాచారం, హత్యకు గురైన వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయూ ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రక్షణకు కఠిన చట్టాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాల విచ్చలవిడితనం వల్ల మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అత్యాచారం జరిగితే అక్కడి ముఖ్యమంత్రి ర్యాలీలు చేయడం, కేంద్రంలోని బీజేపీ నాయకులు ర్యాలీలు చేయడం దోషులను వదిలిపెట్టి సమస్యను పక్కదారి పట్టించడమే అన్నారు. తక్షణమే డాక్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సోమయ్య, టీపీఆర్ దొర, హైమావతి, రజని, లోకేశ్వరి, అరుణకుమారి, జాన్ బాబు, అంతోనమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

**కళ్లకు గంతలు కట్టుకుని నిరసన**

మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దాడుల నియంత్రణకు పార్లమెంటులో పటిష్టం చట్టం తేవాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. కోల్‌కత్తాలో ఆర్‌జీ కార్ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా మహిళా సంఘాలు స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేశాయి. తొలుత మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్, ఇండోర్ స్టేడియం మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని మాట్లాడుతూ ఇటీవల మహిళలు, బాలికలు, చిన్నారులపై అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో రామకోటి సెంటర్, నూజివీడు, సత్రంపాడు, కుక్కునూరులతో పాటు పలు చోట్ల మహిళలపై అత్యాచారం, దాడులు, లైంగిక వేధింపులు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతాల్లో మద్యం షాపులు ఉండటం, గంజాయి, డ్రగ్స్ యథేచ్ఛగా సరఫరా చేయడం వల్లే మానవ మృగాలు ఈ దాడులకు తెగబడుతున్నాయని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా చర్చించి అత్యాచారాల నియంత్రణకు నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను నియమించాలని కోరారు. ధర్నాలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పరకా శ్యామల, పుష్పాల మంగ, పార్వతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, వైజ్ ఏలూరు ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఎన్ లక్ష్మీ కుమారి, కె.సాయితేజశ్వి, కె.ప్రభ, జె.శిరీష, సీహెచ్ నిఖిత, ఎన్ కావ్య తదితరులు పాల్గొన్నారు.


కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని ధర్నా చేస్తున్న నాయకురాళ్లు


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాట్యాచారిణి శిరీష శిష్యులు

**శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో...**

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** ఇటీవల కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనతో దేశంలో మహిళలు, యువతులు, బాలికలు మారణాయుధాలతో తిరగాల్సిన పరిస్థితి వచ్చేలా ఉందని నగరానికి చెందిన కూచిపూడి నృత్య గురువు మేదరమెట్ల శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక దొండపాడు నుంచి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ ఇటువంటి ఘటనలపై ప్రతిస్పందించే విధంగా తమ శిష్యులకు సామాజిక బాధ్యత తెలిసేలా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం నెల నెలా రేషన్ ఇస్తున్నట్టుగా మహిళలకు, యువతులకు పెప్పర్ స్ప్రే కూడా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

## రైతులు, డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

**ఏలూరు రూరల్** : బ్యాంకింగ్ అధికారులు రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు అందించాలని డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు కోరారు. బుధవారం ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏలూరు రూరల్, పెదపాడు, పెదవేగి మండలాల త్రైమాసిక ఎంఎల్‌బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఖరీఫ్‌లో కౌలు రైతులకు రుణ అర్హత పత్రాలు అందజేసిందని, బ్యాంకులు సాగుదారులకు సకాలంలో రుణాలు అందించాలని కోరారు. పశుసంవర్ధకశాఖ అధికారి జి.నెహ్రూబాబు మాట్లాడుతూ పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న చిన్న, సన్నకారు రైతులకు సైతం రుణాలు మంజూరు చేస్తే రైతాంగానికి చేదోడుగా ఉంటుందని తెలిపారు. మెప్మా పీడీ ఇమ్మానియేలు మాట్లాడుతూ రుణాల రికవరీలో డ్వాక్రా సంఘాలు ముందు వరుసలో ఉంటాయని తెలిపారు. పెరుగుతున్న మార్కెట్ రంగంలో కొత్త వ్యాపారులు నిర్వహించేందుకు డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించాలన్నారు. తొలుత ఎల్డీఎం నీలాద్రితో పాటు వివిధ బ్యాంకులు మేనేజర్లు రుణాలు మంజూరు, టార్గెట్, రికవరీ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

## పురావస్తు ప్రదర్శన శాల సందర్శన


పురావస్తు ప్రదర్శన శాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** ఏలూరు ప్రాచీన కళా వైభవాన్ని చారిత్రిక ఆధారాలతో నిక్షిప్తం చేసి, వాటిని నేటితరానికి అందించే గురుతర బాధ్యతను స్వీకరించామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక అగ్రహారంలో ఏర్పాటు చేసిన జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను ఎమ్మెల్యే చంటి బుధవారం సందర్శించారు. అక్కడ ప్రదర్శనకు ఉంచిన శిలా వైభవాన్ని, కళాత్మక శిల్పాలను తిలకించారు. కార్యక్రమంలో పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు, టెక్నికల్ అసిస్టెంట్ సత్య, మాజీ డిప్యూటి మేయర్ చోడే వెంకటరత్నం, సామాజిక కార్యకర్త బీకేఎస్‌ఆర్ అయ్యంగార్, పురావస్తు శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాలకు పందిరి రాట


పందిరి రాట పాతుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** స్థానిక ఒన్‌టౌన్‌లోని ఎస్ఎస్ కూరగాయల మార్కెట్ వద్ద ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల నిమిత్తం బుధవారం పందిరి రాట పాతారు. శ్రీ జరాపహరేశ్వర స్వామి కూరగాయల వర్తక సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో తొమ్మిది రోజల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని సంఘ ప్రతినిధులు తెలిపారు. పందిరి రాట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొద్దాపు గోవిందు, ఉపాధ్యక్షులు తుంపాల గంగాధరరావు, కోలా భాస్కర రావు, బొండా రాజా, అగ్రహారపు శివ, కత్రి చిన్న, కొఠారి మోహన్, మొండెపు రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిపైనా మానవత్వాన్ని చూపాలి


రోగులకు పోష్టికాహారాన్ని అందిస్తున్న రామిశెట్టి గంగాధరరావు, సూపరిండెంటెంట్ సునీత

**భీమడోలు:** ప్రతి ఒక్కరి పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలి జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన రోగులకు, పిల్లలు, బాలింతలుకు పోష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సమాజాన్ని స్థాపించడంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ సునీత, జిల్లా కోశాధికారి పసుపులేటి సాంబశివరావు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, ఆడిట్ కన్వీనర్ జి.రమణ శంకర్, పెద్దలు కీళ్ల పాండురంగారావు, వైద్యులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 28 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 24 | చిక్కుడు కాయలు | 40 |
| వంకాయలు (కాంతులు) | 40 | చామదుంపలు | 46 |
| వంకాయలు (తెలుపు) | 40 | ములక్కాదలు | 7,10 |
| బెండకాయలు | 28 | కంద | 50 |
| పచ్చిమిర్చి | 32 | బీట్‌రూట్ | 36 |
| కాకర కాయలు | 40 | కీరా దోస | 48 |
| బీరకాయలు | 30 | ఫ్రెంచ్‌బీన్స్ | 64 |
| బీరకాయలు (పందిరి) | 40 | అల్లం | 100-160 |
| క్యాబేజీ | 26 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 36 | పాలకూర | 10 |
| దొండకాయలు | 28 | చుక్కకూర | 10 |
| బంగాళదుంపలు | 42 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 44 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 40 | పుదీనా | 05 |
| దోసకాయలు | 24 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 10-15 | క్యాప్సికమ్ | 80 |
| పొట్లకాయ(1) | 20 | చిలకదదుంప | 48 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 33 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 39 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 14 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 28 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 28 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 28 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 27 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 24 |
| ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 25 |
| ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 20 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 31 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 22 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 23 |

### దోసపాడు పేదలకు న్యాయం చేయాలి


చెరువు వద్దకు వెళ్తున్న దళితులను వారిస్తున్న ఎస్సై

**దెందులూరు:** జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అసలైన అసైన్డ్‌దారులకు భూమి అప్పగించాలని దోసపాడులో దళితులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాలి, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులు పేదల చెరువుల వద్దకు వెళ్తున్నవారికి పోలీసులు అడ్డుకున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు భూస్వాములకు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆరోపించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాలు ఇప్పటి వరకు పాటించకపోవడమేమిటని ప్రశ్నించారు. పేదలకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఆయా శాఖల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శించారు.

## వరద కష్టాలు.. ఖరీఫ్ సాగులో భిన్న దృశ్యాలు

**గణపవరం:** సాధారణంగా ఏ పంట కాలంలోనైనా వరి సాగులో సారూప్యత కనిపిస్తుంది. రైతులంతా దాదాపు ఏక కాలంలో వ్యవసాయ పనులు చేస్తుంటారు. ముఖ్యంగా ఒకే గ్రామంలో, ఒకే ఆయకట్టులో వ్యవసాయ పనులు దాదాపు ఒకేలా సాగుతుంటాయి. వారం రోజుల వ్యవధిలో నారుమళ్లు వేయడం, పొలాలు దమ్ము చేయడం, వరినాట్లు వేయడం, కోతలు కోయడం, మాసూళ్లు చేయడం వంటి పనులు ఏకకాలంలో జరుగుతుంటాయి. అయితే ప్రస్తుత ఖరీఫ్ వ్యవసాయం దీనికి భిన్నంగా సాగుతోంది. ఒకే ప్రాంతంలో ఒకే ఆయకట్టులో భిన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలో దాదాపు 75శాతం సార్వా నాట్లు వేసిన పొలాలు ముంపుబారిన పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగైదు రోజుల్లో ముంపునీరు బయటకు పోవడంతో వరిపైరు సస్యరక్షణ చర్యలతో బతికి బట్టకట్టింది. మరి కొన్ని ప్రాంతాల్లో వారం నుంచి 10 రోజుల వరకూ పైరు ముంపులోనే ఉండటంతో వరినాట్లు కుళ్లిపోయాయి. ఇలాంటి చోట్ల రైతులు మళ్లీ నారుమడులు వేయగా, కొందరు రైతులు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి, బయటి జిల్లాల నుంచి నారు తెచ్చుకుని నాట్లు వేశారు. దీనితో గణపవరం మండలంలో సార్వా సాగు వివిధ రకాలుగా సాగుతోంది. మండలంలో మొత్తం 14 వేల ఎకరాల్లో సార్వా సాగు చేస్తున్నారు. ఎ.గోపవరం, అర్ధవరం, మగ్గుల్ల, వాకపల్లి, వల్లూరు, చిలకంపాడు, కాశిపాడు, వీరేశ్వరపురం తదితర గ్రామాల్లో సార్వా పైరు వరదబారి నుంచి త్వరగా బయటపడటంతో ఆ గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో పైరు దుబ్బుచేసి, ఏపుగా పెరుగుతోంది. దీనితో రైతులు మొదటి విడత ఎరువుల కోటా పైరుకు అందిస్తున్నారు. గణపవరం, కోమర్రు, మొయ్యేరు, డికెవల్లి గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్నారు. నారుతీయడం, నాట్లు వేయడం కార్యక్రమాల్లో రైతులు బిజీగా ఉన్నారు. ఒకే ఆయకట్టులో కొందరు రైతులు పైరుకు మొదటి విడత ఎరువులు వేస్తుంటే ఆ పక్కనే ఇంకా నాట్లు వేస్తున్న పొలాలు, నాట్లు వేయడానికి దమ్ము చేసి సిద్ధం చేసిన పొలాలు దర్శనం ఇస్తున్నాయి. మరోచోట వరినాట్లు వేస్తుంటే, ఆ ఆయకట్టులోనే మరోచోట నారుమడులు రెండుమూడు అంగుళాలు ఉంటే ఆ పక్కనే చేను మురగ దమ్ములు జరుగుతున్నాయి. ఇలా ఒకే ప్రాంతంలో సాగు విభిన్న దశలలో సాగుతుండటం గతంలో ఎప్పుడూ చూడని విశేషంగా చెబుతున్నారు. గత నెలలో సార్వా నాట్లు వేసిన సమయంలో భారీ వర్షాలు, వరదల కారణంగా కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.


వాకపల్లిలో సార్వా పైరుకు మొదటి దఫా ఎరువు అందిస్తున్న రైతు


పిప్పరలో నారు తీస్తున్న రైతులు